సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం। 25। జనవరి। 2024



చలిగాలుల విజృంభణ
జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతు న్నాయి. ఉధృతంగా వీస్తున్న చలిగాలులు వణికిస్తున్నాయి. 10లో



ఉన్నత లక్ష్యంతో భవిష్యత్తు
ఉన్నత లక్ష్యం ఏర్పరచుకుని చదువుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు పొందవచ్చని ఐసీడీఏస్ పీడీ సూర్యలక్ష్మి సూచించారు. 10లో



నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి
భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సూచించారు. 10లో

న్యూస్‌రీల్

గంజాయి సాగు, రవాణాకు సహకరిస్తే చర్యలు



నుర్మతి గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ రమేష్

జి.మాడుగుల: గంజాయి సాగుతోపాటు, రవాణాకు సహకరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో నుర్మతి అవుట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు మారుమూల గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. గిరిజనులతో మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు, ఇబ్బందులు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు గిరి ప్రజలు, యువత దూరం ఉండాలని ఆయన సూచించారు. నాటుసారా తయారీ, విక్రయాల సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు

వై.రామవరం: మండల కేంద్రమైన వై.రామవరం గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం రూ.66 వేల విలువైన 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎం సంతోష్‌కుమార్ తెలిపారు. సరిహద్దు ప్రాంతం నుంచి వై.రామవరం మీదుగా మైదాన ప్రాంతానికి తరలిస్తూ కాకినాడకు చెందిన బాలుడితో పాటు ద్రాక్షారపు ఉమాశంకర్(20), వై.రామవరం మండలం రాచమెట్ట గ్రామానికి చెందిన కొర్ర ఆనందరావు (25) పట్టుబడ్డారన్నారు. ఈ కేసులో బైక్, గంజాయిని సీజ్ చేసినట్టు తెలిపారు. నిందితులను అడ్డతీగల కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండు విధించారన్నారు. ఈ మేరకు వారిని బుధవారం రాజమహేంద్రవరం కేంద్రకారాగారానికి తరలించామని తెలిపారు.

పర్యాటక రంగానికి ఆదాయం అదుర్స్

జిల్లాలో సందర్శనీయ ప్రాంతాలకు టూరిస్టుల తాకిడి పెరిగింది. పర్యాటక రంగానికి రోజు రోజుకు ఆదాయం మెరుగుపడుతోంది. వరుస సెలవులు ఉన్నప్పుడల్లా పర్యాటకులు మన్యాన్ని సందర్శించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ రోజున ఎక్కువ సంఖ్యలో తరలివచ్చారు. అదే స్థాయిలో ఆదాయం వచ్చింది. ఆ తరువాత కూడా పర్యాటకుల రాక మెరుగ్గానే ఉంది.




పండగ రోజుల్లో అనంతగిరి మండలంలోని బొర్రా గుహలకు భారీగా తరలివచ్చిన పర్యాటకులు

- సంక్రాంతికి తరలివచ్చిన సందర్శకులు
- పండగ మూడు రోజుల్లో భారీగా రాక
- రూ.కోట్లలో ఆదాయం

అనంతగిరి: జిల్లాలోని సందర్శనీయ ప్రాంతాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా సెలవు దినాల్లో వీరి తాకిడి ఎక్కువగా ఉంటుంది. జిల్లాలోని సందర్శనీయ ప్రాంతాల్లో వంజంగి హిల్స్, చాపరాయి, కొత్తపల్లి జలపాతాలు, చెరువులవేనం, తాజంగి జలాశయం, అరకు గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, బొర్రా గుహలు కీలకమైనవి. పర్యాటకులకు కూడా వీటిని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

బొర్రా గుహలు: భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల్లో 23,100 సందర్శించారు. 17.75 లక్షల ఆదాయం వచ్చింది. ఈనెల 14న 7,100 మంది సందర్శించగా రూ. 5.29 లక్షలు, 15వ తేదీ 8వేల మంది సందర్శించగా రూ.6.11లక్షలు, 16వ తేదీన సుమారు



సందర్శకులతో కిక్కిరిసిన కొత్తపల్లి జలపాతం

8 వేల మంది సందర్శించగా 6.35 లక్షల ఆదాయం సమకూరిందని అధికారవర్గాలు తెలిపాయి.

అరకు గిరిజన మ్యూజియానికి రూ.20 లక్షలు..

సాక్షి, పాడేరు: ఈనెల 12నుంచి 19 వరకు 20 వేల మంది సందర్శించారు. సుమారు రూ.20 లక్షలు ఆదాయం వచ్చిందని మేనేజర్ మురళి తెలిపారు.

అరకు పద్మాపురం గార్డెన్: ఈనెల 12నుంచి 19 వరకు 21 వేల మంది సందర్శించగా రూ.20 లక్షల మేర ఆదాయం వచ్చిందని అధికారవర్గాలు తెలిపాయి. అరకులోయ మండలంలోని గిరిదర్శినిని ఈనెల 12 నుంచి 19 వరకు 3 వేలమంది సందర్శించగా రూ.5 లక్షల మేర ఆదాయం సమకూరింది. పాడేరు మండలంలోని మేఘాల కొండగా ప్రసిద్ధి చెందిన వంజంగి హిల్స్‌కు రూ.1.50 లక్షలు సందర్శకుల ద్వారా వచ్చింది.

కొత్తపల్లి జలపాతం: ఈనెల 12నుంచి 19 వరకు 3,200 మంది సందర్శించగా రూ.5 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు ఐటీడీఏ అధికారవర్గాలు తెలిపాయి.

జిప్‌లైన్‌తో భారీగా ఆదాయం



బొర్రా గుహల వద్ద జిప్‌లైన్‌ను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ రూ.65 లక్షలతో ఏర్పాటు చేసిన దీనిని గతేడాది అక్టోబర్ 19న అందుబాటులోకి తెచ్చారు. పర్యాటకులు ఒకొక్కరి నుంచి టికెట్ రూపంలో రూ.500 వసూలు చేస్తున్నారు. అక్టోబర్‌లో 3257 మంది సందర్శించగా రూ.16, 28,500, నవంబర్‌లో 4,108 మంది నుంచి రూ.20.54 లక్షలు, డిసెంబర్ నుంచి 13,636 మంది నుంచి రూ.68.78 లక్షలు, జనవరిలో ఒకటో తేదీ నుంచి 8 వరకు 3,415 మంది సందర్శించగా 17.07 లక్షలు, 14 నుంచి 18 వరకు 3,452 మంది సందర్శించగా రూ.17.30 లక్షలు సమకూరింది. వచ్చిన ఆదాయంలో 12 శాతం పర్యాటక శాఖకు చెల్లిస్తున్నారు. జిప్‌లైన్ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు 27,868 మంది సందర్శించగా రూ.1,39,34,000 ఆదాయం వచ్చింది. ఈ ప్రకారం పర్యాటక శాఖకు 12శాతం రూపంలో సుమారు 14 లక్షల మేర ఆదాయం వచ్చింది. జిప్‌లైన్‌ను పర్యాటకశాఖ నేరుగా నిర్వహిస్తే ఏడాదికి రూ.2 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని పలువురు సూచిస్తున్నారు.

చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలి



ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు తదితరులు

ఆసరా చెక్కు పంపిణీలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసగించిన చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ సమన్వయకర్త, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం రాజేంద్రపాలెం అల్లూరి కళామందిరంలో ఏర్పాటు చేసిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్, అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. చంద్రబాబు మరోసారి ప్రజలను నిలువునా మోసం చేస్తారనడానికి ఆయన చెబుతున్న పథకాలే సాక్ష్యమన్నారు. ఆయన ఇస్తున్న హామీలన్నీ ఆచరణ సాధ్యం కానివేనన్నారు. కొయ్యూరు మండలానికి సంబంధించి ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో 680 గ్రూపుల్లో 7,178 మహిళలకు రూ.12.89 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చింది జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు. వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త ఎం.విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి చేయాల్సిన అవసరం రాష్ట్రానికి ఉందన్నారు. పేదవాడు సంక్షేమాన్ని కోరుకునే వ్యక్తి ఆయన ఒక్కరేనన్నారు.ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ మహిళా నేతలపై తప్పుడు ప్రచారం చేసే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జెడ్పీటీసీ వారా నూకరాజు,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, పీఏసీఎస్ చైర్మన్ సుమర్ల సూరిబాబు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, ఎంపీటీసీ బి.అప్పారావు, ఎంపీడీవో లాలం సీతయ్య, రాజేంద్రపాలెం సర్పంచ్ సింహాచలం, వెలుగు ఏపీఎం జి.గాంధీ ప్రసాద్, ఏసీ మధుబాబు, సీసీలు,పలువురు నేతలు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు

278 సెల్ టవర్ల నిర్మాణం పూర్తి

- నేడు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- ఈదులపాలెం, లైగండలో ఏర్పాట్లు పూర్తి
- ఆయా గ్రామాల గిరిజనులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి

సాక్షి, పాడేరు: జిల్లాలో 278 సెల్ టవర్లను వర్చువల్ విధానంలో గురువారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లావ్యాప్తంగా 2061 టవర్లను నిర్మించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. వీటిలో తొలివిడతగా గతేడాది జూన్ 14వ తేదీన 100 సెల్ టవర్లను ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. రెండవ విడతలో మరో 278 టవర్లను గురువారం ఆయన ప్రారంభించనున్నారు. వీటిలో 103 ఎయిర్‌టెల్, 178 జియో టవర్లు ఉన్నాయి. పాడేరు మండలం మారుమూల ఈదులపాలెం, డుంబ్రిగుడ మండలం మారుమూల లైగండ గ్రామాల్లో సెల్ టవర్లను గురువారం ఉదయం 10.30 గంటలకు సీఎం వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. అనంతరం ఆయన ఆ రెండు గ్రామాల గిరిజనులతో మాట్లాడతారని వారు వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సభా ప్రాంగణాలను గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఏర్పాటుచేశారు. ఈదులపాలెంలో కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు హాజరవుతారు. లైగండలో కార్యక్రమానికి ఐటీడీఏ పీవో అభిషేక్, అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారు.



లైగండలో సీఎం ప్రారంభించే సెల్ టవర్



ఈదులపాలెంలో ఏర్పాటుచేసిన వేదిక



లైగండలో ఏర్పాటుచేసిన స్క్రీన్

కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఉత్తమ పురస్కారం

- ప్రకటించిన ఎన్నికల కమిషన్
- 18,012 మంది పీవీటీజీలను ఓటర్లుగా చేర్పించినందుకు గుర్తింపు
- ఇద్దరు బీఎల్వోలకు ఉత్తమ అవార్డులు



కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఎన్నికల అధికారిగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎన్నికల కమిషన్ ఎంపిక చేసింది. జిల్లా వ్యాప్తంగా అర్హులైన 18,012 మంది పీవీటీజీ (ఆదివాసీ)లను కొత్త ఓటర్లుగా నమోదు చేయించినందుకు ఆయనకు ఉత్తమ అవార్డు ప్రకటించింది. దీంతోపాటు జి.మాడుగుల మండలంలోని 25వ పోలింగ్ కేంద్రం బూత్ లెవెల్ అధికారిగా పనిచేస్తున్న సాయి వెంకటప్రసాద్ కూడా ఎలక్టోరల్ విధులు సక్రమంగా నిర్వహించడంతో ఉత్తమ బీఎల్‌వోగా ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని విజయవాడలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాలు అందుకోనున్నారు. ఈ మేరకు హాజరు కావాలని వారికి ఆహ్వానం అందింది.

బడదనాంపల్లి సచివాలయ కార్యదర్శికి..

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి సచివాలయ కార్యదర్శి ఆచంట కోటేశ్వరరావును రంపచోడవరం నియోజకవర్గ ఉత్తమ బీఎల్వోగా ఎన్నికల కమిషన్ ఎంపిక చేసినట్టు తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచారి తెలిపారు. పంచాయతీ పరిధిలో ఎక్కువ మంది పీవీటీజీలను ఓటర్లుగా చేర్చడంలో ఆయన కృషికి ఈ పురస్కారం లభించిందన్నారు.



సాయి వెంకట ప్రసాద్



ఆచంట కోటేశ్వర్రావు

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.54.06 లక్షలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో గత నెల 30 నుంచి ఈ నెల 24వ తేదీ వరకు హుండీల ద్వారా వచ్చే ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. సాధారణ హుండీల ద్వారా రూ.54,06,435 నగదు రాగా, అన్నదానం హుండీ ద్వారా రూ.1,00,253 సమకూరింది. 76.100 గ్రాముల బంగారం, 1.410 కేజీల వెండి రాగా.. 423 అమెరికా డాలర్లు, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్‌కు చెందిన ఒక దినార్ వచ్చింది.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్
- గంగవరం మండలంలో రోడ్‌షోకు విశేష స్పందన
- ఘన స్వాగతం పలికిన ప్రజలు

గంగవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అవినీతి రహిత పాలన అందిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఓజుబంద నుంచి గ్గంపాలెం, జియ్యంపాలెం, పాతరామవరం, నెల్లిపూడి, చిన్నంపాలెం, పిడతమామిడి మీదుగా మొల్లేరు వరకు వైఎస్సార్ వాహన యాత్ర (రోడ్ షో)ను వారు నిర్వహించారు. వారికి ప్రజలు హారతులు పట్టి నీరాజనం పలికారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభల్లో వారు నాలుగున్నర సంవత్సరాల జగనన్న పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఒక్క గంగవరం మండలంలో వివిధ సంక్షేమ కార్యక్రమాల పేరిట లబ్ధిదారుల ఖాతాల్లో రూ.135 కోట్లను సీఎం జమ చేశారన్నారు. రోడ్‌షోలో తెలుసుకున్న ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2,934 మందికి పింఛన్లు ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వంలో పెంచిన మొత్తంతో 4,032 మందికి అందజేస్తున్నారన్నారు. రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు, వాహనమిత్ర, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, గృహ నిర్మాణం, పోడు, అసైన్డ్ భూములకు పట్టాల పేరిట వేలాది మందికి లబ్ధి చేకూరిందన్నారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించామన్నారు. పాఠశాలలు, గంగవరంలో పీహెచ్‌సీని అభివృద్ధి చేశామని వారు పేర్కొన్నారు. మొల్లేరు నుంచి ఆర్థీపురం వరకు రూ.2కోట్లతో బీటీ రోడ్డు నిర్మించామని చెప్పారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: ఎమ్మెల్సీ అనంతబాబు

ప్రతిపక్షాలు చేసే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, నిరతంరం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండా నిలుస్తామని ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. రోడ్‌షో ముగింపు సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ధైర్యంగా చెబుతున్నామని గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని ఆ పార్టీ నేతలు ధైర్యంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. పాతరామవరంలో అగ్ని బాధితురాలు కె. దేవి కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అందజేశారు. పిడతమామిడి వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. నెల్లిపూడిలో అంబేడ్కర్ సెంటర్ వద్ద మహిళలు వారిపై పూలవర్షం కురిపించారు. వైఎస్సార్ సీపీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి సూరంపూడి ఏడుకొండలు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని భారీ గజమాలను క్రేన్ సాయంతో సత్కరించారు. రోడ్‌షో విజయవంతానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ ఎంపీపీలు గంగాదేవి, రామతులసి, ఎంపీటీసీలు వెంకటలక్ష్మి, పద్మావతి, కనకలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు ప్రభాకర్, మొల్లేరు సొసైటీ చైర్మన్ తిరుపతిరావు, డైరెక్టర్లు ప్రసాద్, పండా సిద్ధార్థ, పార్టీ మండల కన్వీనర్ అప్పలరాజు, మండల ఇన్‌చార్జి రఘునాథ్, సర్పంచ్‌లు లీలావతి, పార్వతి, రమణమ్మ, మరిడమ్మ, కె.లక్ష్మి, శివ, కామరాజు, అక్కమ్మ, అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శులు ఏడుకొండలు, బాబి పాల్గొన్నారు.



పాతరామవరంలో అగ్ని బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



ఓజుబందలో రోడ్‌షోకు తరలివచ్చిన జనం

క్లుప్తంగా

సీఎం సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: విశాఖపట్నంలోని ఈనెల 27న జరగనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని డముకు వారపు సంతలోని బుధవారం పార్టీ నాయకులతో చర్చించారు. ఎన్నికల శంఖారావం పూరించేందుకు భారీ బహిరంగం ఏర్పాటు జరుగుతున్నాయని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సమష్టిగా శ్రమించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు స్వామి, మాజీ జెడ్పీటీసీ గంగన్నదొర, వాలసీ సర్పంచ్ సన్యాసిరావు, నాయకుడు గంగరాజు పాల్గొన్నారు.

చలిగాలుల విజృంభణ

- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- మినుములూరులో 13, అరకులోయ, చింతపల్లిలో 14 డిగ్రీల నమోదు

సాక్షి,పాడేరు: జిల్లాలో చలిగాలులు విజృంభిస్తున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి చలిగాలులు వీస్తున్నాయి.అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం ఉదయం 10గంటల వరకు మంచుతెరలు వీడడం లేదు. వ్యవసాయ పనులు, సంతలకు వెళ్లే గిరిజనులు పొగమంచు, చలితీవ్రతతో అవస్థలు పడుతున్నారు. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 13 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద 14డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



మహిళలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

- భారీగా హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళలు
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం
- థ్యాంక్యూ సీఎం సర్ అంటూ నినాదాలు
- మహిళలకు చెక్కులు పంపిణీ

పాడేరు : మహిళ సాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసి మహిళలను మహారాణులు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. బుధవారం వైఎస్సార్ ఆసరా విజయోత్సవ వేడుకలను పట్టణంలోని మోదకొండమ్మ తల్లి ఆలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబునాయుడుదేనని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీను అమలు చేసి చూపించి ప్రజల నమ్మకాన్ని నిలుపుకున్నారన్నారు. అనంతరం పాడేరు మండలంలోని 213 సంఘాలకు చెందిన 2,217 మహిళలకు రూ.3,39,00,000 చెక్కులను పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సర్, జై జగన్ నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తించారు. కార్యక్రమంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ మినుముల సరస్వతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, వెలుగు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు



ప్రజావేదిక కార్యక్రమంలో డ్వామా పీడీ శివయ్య తదితరులు

కొయ్యూరు: ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ ఎస్.శివయ్య హెచ్చరించారు. మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం బుధవారం జరిగింది. ఇందులో వివిధ గ్రామాల్లో 1157 పనులపై సోషల్ ఆడిట్‌ను నిర్వహించారు. ఆయా పనులకు రూ.19.55కోట్లు వెచ్చించినట్టు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు కొన్ని ప్రాంతాల్లో పనులు జరగకపోయినా చేసినట్టు చూపించిన విషయాలు బయటపడ్డాయి. కార్యక్రమంలో పాల్గొన్న డ్వామా పీడీ ఎస్.శివయ్య మాట్లాడుతూ తప్పులు చేసిన వారిపై చర్యలు తప్పవన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించమని స్పష్టం చేశారు. పనులకు సంబంధించి సమగ్ర సమాచారం అందించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి పనుల్లో రూ.8,12,000 సంబంధిత వీఆర్పీల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు రూ.5వేల జరిమానా విధించారు. జిల్లా విజిలెన్స్ అధికారి చంద్రకళ, ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో లాలం సీతయ్య, ఏపీవో రాజు, ఎస్ఆర్‌సీ కనకరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ముంచంగిపుట్టు సీహెచ్‌సీ సందర్శన
- అధికారులతో సమీక్ష



వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ముంచంగిపుట్టు: ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. తొలుత స్థానిక సీహెచ్‌సీని తనిఖీ చేశారు. మందుల నిల్వ గదిని పరిశీలించారు. మందుల నిల్వలో కొరత లేకుండా చూడాలని సూచించారు.రోజువారీగా నమోదు అవుతున్న ఓపీ వివరాలు తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు.అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ సచివాలయాల నిర్మాణాలు, ఆర్‌బీకేలు, వెల్నెస్ సెంటర్లు నిర్మాణాల పనుల పురోగతిని తెలుసుకున్నారు. ముఖ్యంగా జర్రెల, వనుగుమ్మ, జర్జుల, మాకవరం, దొడిపుట్టు, కిలగాడ పంచాయతీల్లో పీఆర్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న రోడ్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండల స్థాయి అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం తాగునీరు, రేషన్ కార్డులు, భూ సమస్యలపై స్థానిక గిరిజనులు ఆయనకు వినతులు అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గిరిజనులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ నర్సమ్మ, పీఆర్ ఏఈఈ గోపాలకృష్ణ,ట్రైబల్ వెల్ఫేర్ ఏఈఈ జబ్బర్, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- వై.రామవరం మండలంలో పర్యటన



నూతన భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

వై.రామవరం: భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సూచించారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, గురుకుల బాలికల జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. నూతన భవనాలతోపాటు, అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయ, సిబ్బంది క్వార్టర్ల భవన నిర్మాణాలను పరిశీలించారు.

ఆరోపణలపై విచారణ

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, గురుకుల బాలికల జూనియర్ కళాశాలపై వచ్చిన వివిధ ఆరోపణలపై పీవో సూరజ్ గనోరే విచారణ నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ సక్రమంగా అందుతుందా లేదా అన్న అంశాలపై విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు షూస్, విద్యకు సంబంధించిన కిట్లను పీవో అందజేశారు. తరగతి గదులను సందర్శించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ, గిరిజన సంక్షేమశాఖ ఈఈ జి. డేవిడ్ రాజు, డీఈఈ నాగరాజు, ఏఈ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

సీహెచ్‌సీ సందర్శన

వై.రామవరం సీహెచ్‌సీని బుధవారం రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గానోరే తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. అన్ని విభాగాలను, మందుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను రోగుల నుంచి తెలుసుకున్నారు. సూపరింటెండెంటు డాక్టర్ రాహుల్‌కు సూచనలిచ్చారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, నిర్వహణపై పీవో సంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న అదనపు గదులు, కల్పిస్తున్న ఆధునిక సౌకర్యాలను ఆయన పరిశీలించారు. డాక్టర్ జీవన్, మధులత, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో భవిష్యత్తు

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

సాక్షి,పాడేరు: బాలికలంతా ఉన్నత లక్ష్యం ఏర్పరచుకుని చదువుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు పొందవచ్చని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి సూచించారు. స్థానిక శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఉన్నత విద్య, ,ఉద్యోగాలు, బాల్య వివాహాల నిర్మూలన,బాలికల హక్కులు, చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గిరిజన బాలికలంతా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన అన్ని విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని సూచించారు. రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే బాలికలు సకాలంలో వైద్యసేవలు పొందాలని, తరచూ ఇళ్లకు వెళ్లడం మానుకోవాలని ఆమె కోరారు. పాడేరు సీడీపీవో ఝాన్సీరాణి, హెచ్ఎం ఎం.మంజుల, వసతి గృహ సంక్షేమ అధికారిణి బి.మాధవి,పీడీ కె.కుమారి, సూపర్‌వైజర్లు రాజేశ్వరి, లక్ష్మి,కవిత, రమణి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- విద్యార్థినులకు సూచన



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: బాల్యవివాహాలను విద్యార్థినులు వ్యతిరేకించాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. బుధవారం స్థానిక ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో జరిగిన జాతీయ బాలికల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి బాలికా దినోత్సవం నిర్వహిస్తోందన్నారు. బాలికలు ఉన్నత చదువులను అభ్యసించి మంచి భవిష్యత్తు ఏర్పరచుకోవాలని సూచించారు. ఆడ పిల్లలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన ఉండాలని అన్నారు. పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. రాగి జావ తాగడం అలవాటు చేసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల్లో మంచి మంచి పోషక విలువలు ఉంటాయన్నారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లాలని విద్యార్థినులకు సూచించారు. బాల్య వివాహాలు నేరమని, వీటిపై గ్రామ సచివాలయ మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, వైద్యాధికారిణి గాయత్రి తదతరులు పాల్గొన్నారు.

సంతలో అధికారుల తనిఖీలు



వారపు సంతలో కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

డుంబ్రిగుడ: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం కించుమండల వారపు సంతలో విశాఖపట్నం సిటీ అసిస్టెంట్ కంట్రోలర్ పి.డి.వి.అప్పలరాజు, అనకాపల్లి ఇన్‌స్పెక్టర్ డి.భాస్కర్‌రావు, ఉమా సుందరి తదితరులు బుధవారం తనిఖీలు చేశారు. సంతలో కిరాణా, కూరగాయాల ఇతర దుకాణాల్లో తనిఖీ చేసి, నిబంధనలు అతిక్రమించిన ఐదుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. తూనికలు, కొలతలు సక్రమంగా పాటించాలన్నారు. తూకాల్లో మోసం చేస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతుడు వంశీకృష్ణ

కూనవరం: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన టేకులబోరు శివారులో పెదవాగు వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం పంద్రాజుపల్లి గ్రామానికి చెందిన కుడియం కృష్ణ వంశీ (17) బాబాయి వరస అయిన కణితి రాజారావుతో కలిసి పెదవాగు నుంచి పొలాలకు నీరందిస్తున్న మోటార్ల పనితీరు పరిశీలన వెళ్లారు. ఈ క్రమంలో వంశీకృష్ణ అదుపుతప్పి మోటార్ ఇంజన్ పైపులైన్‌పై చేయి వేయడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు, వెంటనే అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్టు చెప్పారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

గిరిరైతులకు చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లిరూరల్: గిరిజన రైతుల ఆర్థిక ప్రగతికి ప్రత్యేక చేయూత పోలీస్‌శాఖ తరపు ఎల్లప్పుడు ఉంటుందని అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు.మండల సమావేశ మందిరంలో కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సాగులు, వీరవరం గ్రామాలకు చెందిన రైతులకు బుధవారం పలు రకాల పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం పంటలు పండించేందుకు అనువుగా ఉంటుందని కావున రైతులు వాణిజ్య పంటలు పండించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీసీటీ ద్వారా పలు రకాల పంటలపై పరిశోధనలు చేస్తున్నారన్నారు. రైతులు చిన్న చిన్న వ్యాపారం చేసుకోనేందుకు సబ్సీడీపై పసుపు, మిరియాలు పొడి చేసుకోనే యంత్రాలను కొనుగోలు బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరుకు కృషి చేస్తారన్నారు. అనంతర వారపు సంతలో వ్యాపారస్తులతో మాట్లాడారు. ట్రాఫిక్ సమస్య తలేత్తకుండా చూడాలని సూచించారు. బీసీటీ చైర్మన్ శ్రీరామూర్తి, శాస్త్రవేత్త ప్రసాదరావు, ఎల్‌డీఎం రవితేజ, సీఐలు రమేష్, అశోక్‌కుమార్, ఎస్ఐ అరుణ్‌కిరణ్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవం.. ఆది దంపతుల కల్యాణం

పట్టు వస్త్రాలు, నుదుటున కల్యాణ తిలకం... బాసికం.. పాదాలకు పారాణితో అమ్మను.. బుగ్గన చుక్క...మెడలో అందమైన సుగంధ పుష్ప మాలలు... నిండైన రూపంతో శివయ్యను పెళ్లికూతురు, పెళ్లికుమారుడుగా అలంకరించి వేదికపై అధిష్టింప జేసిన వేళ ఆ ఆది దంపతులను కనులారా తిలకించిన భక్తులు పరవశించిపోయారు. అలౌకికానందంలో తన్మయులయ్యారు. మళ్లీమళ్లీ ప్రణామాలు ఆచరిస్తూ, స్మరిస్తూ... భక్తిప్రవత్తులతో గౌరీ పరమేశ్వరుల కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు



కల్యాణంలో గౌరీపరమేశ్వల ఉత్సవ విగ్రహాలు



సారెను ఊరేగిస్తున్న మహిళా భక్తులు

అనకాపల్లి: గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఆలయ ఆవరణలో బుధవారం అమ్మవారి కల్యాణం కమనీయంగా జరిగాయి. ఈనెల 27న జరిగే అమ్మవారి ఉత్సవంలో భాగంగా కల్యాణంతోపాటు సారె ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, సింధుజ దంపతులతో అర్చకులు నేతేటి సుబ్రహ్మణ్యశర్మ కల్యాణం జరిపించారు. కల్యాణవేడుకలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణం అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. సాయంత్రం 3 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు కన్నులపండువగా సాగింది. ఊరేగింపులో తీన్మార్ వాయిద్యాలు, బ్యాండ్, సన్నాయిమేళం, తోడపెద్దుసేవ, డీజే సౌండ్‌లో వేలాదిమంది మహిళా భక్తులు పాల్గొన్నారు.

బూరెలు, అరిసెలు, గవ్వలు, సున్నిపాకుండలు, పూతరేకులు, జంతికలు, మురుకులు, పాలముంజెలు వంటి తినుబండారాలతోపాటు పసుపు, కుంకుమలు, విభూదిలింగం, చీరలు, కూరగాయలు, వాహనం, ఫర్నిచర్ ఊరేగింపులో ఆకర్షణగా నిలిచాయి. ఊరేగింపును సీఐ శంకరరావును ప్రారంభించారు. ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.